చినుకు జాడలేక.. సాగు చేసే ధైర్యం రాక

- మండలంలో గణనీయంగా తగ్గిన సాగు
- చినుకు జాడలేక సాగు చేసిన రైతాంగంలో ఆవేదన
- వరుణుడు కరుణించకుంటే మిగిలేది నష్టాలేనంటున్న రైతులు


వర్షం కోసం ఎదురు చూస్తున్న రైతన్న

సుండుపల్లె : మండల వ్యాప్తంగా తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఆకాశం మేఘావృతంగా ఉన్నా వర్షాలు జాడ లేదు. అడపాదడపా పడుతున్న చిన్న జల్లులు కురిస్తున్నా.. బలమైన వర్షాలు కురిపించక వరుణుడు ముఖం చాటేస్తున్నాడు. అదునుకు అనుగుణంగా వర్షాలు పడకపోవడంతో ఈ ఖరీఫ్ సీజన్‌లో వర్షాధారంతో రైతులు వేసుకున్న పంటలు చేతికొస్తాయో లేదోనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొందరు రైతులకు బోరుబావులలో నీరు అడుగంటడంతో పంటల సాగుపై వర్షం తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నది. మండలంలోని రైతులు సాధారణంగా ప్రతి సంవత్సరం 1477 హెక్టార్లలో వ్యవసాయం చేస్తుండగా ఈ ఏడాది ఖరీఫ్‌లో 557 హెక్టార్లలో మాత్రమే సాగు చేస్తుండటం గమనార్హం. వర్షం పడుతుందన్న ఆశతో అరకొర వ్యవసాయం చేసుకున్న రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిలించేలా పరిస్థితులు కనిపిస్తున్నాయి.

అందని సాగు సాయం

ఒకవైపు వర్షాలు పడక కష్టాలకు గురవుతున్న రైతులకు ప్రభుత్వం రైతు భరోసా కూడా ఇవ్వకపోవడంతో రైతులు మరింత ఇబ్బందులకు గురవుతున్నారు. గత ప్రభుత్వం ఈ సమయానికే రైతులకు పెట్టుబడి కింద రైతు భరోసా పథకం ద్వారా రైతుల ఖాతాలలో నగదును జమ చేసేది. రైతుల వ్యవసాయానికి సంబంధించి కూలీలకు, ఎరువులకు ఎంతోకొంత ఉపయోగపడేది. ప్రస్తుత ప్రభుత్వం అమల్లోకి వచ్చి ఇంతవరకు రైతులకు ఎటువంటి సహాయాన్ని చేయకుండా రైతులపై చిన్నచూపు చూపిస్తున్నదని రైతన్నలు వాపోతున్నారు. మండలంలో రైతుల సంఖ్య 7482 ఉండగా గత రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా పథకం ద్వారా మండలంలోని రైతులకు చేకూర్చిన లబ్ధి ఒక్కో సంవత్సరానికి రూ. 56,11,5000లు, పీఎం కిసాన్ ద్వారా చేకూర్చిన లబ్ధి రూ. 44.892,000లు, ఒక సంవత్సరంలో రైతులకు చేకూర్చిన లబ్ధి మొత్తం రూ, 101,007,000లు.

మండలంలో పంటల సాగు వివరాలు..

సాధారణంగా వేరుశనగ పంటను 927 హెక్టార్లలో సాగు చేసేవారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో 356 హెక్టార్లలో మాత్రమే సాగు చేశారు. వరిమడిని సాధారణంగా 279 హెక్టార్లలో సాగుచేసేవారు. ఈ సీజన్‌లో 150 హెక్టార్లు మాత్రమే రైతులు సాగు చేస్తున్నారు. అలసంద 47 హెక్టార్లలో సాగవ్వాల్సి ఉండగా ప్రస్తుతం 2 హెక్టార్లు, సజ్జలు 166 హెక్టార్లలో సాగు చేయాల్సింది ప్రస్తుతం 45 హెక్టార్లు, ఆముదాల 5 హెక్టార్లలో సాధారణ సాగుగా ఉండగా, ప్రస్తుతం 0.4 హెక్టార్లలో మాత్రమే సాగులో ఉంది. అలానే టమాటా సాధారణ సాగుగా 12 హెక్టార్లలో సాగు అవ్వాల్సి ఉండగా, ఇప్పుడు 4.06 హెక్టార్లు మాత్రమే సాగైంది. మండలంలో కందులు ఏ రైతు సాగు చేసేందుకు ఆసక్తి చూపడం గతంలో 1–2 హెక్టార్లలో రైతులు సాగు చేసేవారు.


పంట అందుతుందో లేదో



నేను వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. నాకు నాలుగు ఎకరాలు వ్యవసాయ భూమి ఉంది. ఈ ఖరీఫ్‌లో 2 ఎకరాల వరి మడిని సాగు చేశాను. ఇప్పటి వరకు దుక్కి దున్నడానికి, ఎరువులకు, కూలీలకు కలిపి రూ.70 వేలు ఖర్చయ్యింది. వర్షాలు సరిగా కురవకపోవడంతో బోరుబావులలో నీరు తక్కువగా ఉంది. చేతికి వచ్చిన పంట అందుతుందా లేదా అని భయమేస్తున్నది. ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి పెట్టుబడి సాయం చేయకపోవడంతో పంట పెట్టుబడి మొత్తం అప్పుచేశాను. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులు దాటిపోయినా మాలాంటి రైతులకు పెట్టుబడి సహాయాన్ని ఇంతవరకు అందజేయలేదు.

– బొడిశెట్టిగారి నారాయణ, సుండుపల్లె

బాధ్యతల స్వీకరించిన సీఐలు


బాధ్యతలు చేపట్టిన కృష్ణంరాజు నాయక్

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా కృష్ణంరాజు నాయక్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా స్థానిక సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో వారు బాధ్యతలు స్వీకరిస్తూ పలి రికార్డులపై సంతకాలు చేశారు. ఈయన గతంలో సత్యసాయి జిల్లా ముదిగుబ్బ సీఐగా బాధ్యతలు నిర్వహించి బదిలీపై ఒంటిమిట్టకు వచ్చారు.

రాయచోటి అర్బన్ సీఐగా పి.చంద్రశేఖర్



రాయచోటి టౌన్ : రాయచోటి అర్బన్ సీఐగా పి.చంద్రశేఖర్ బాధ్యతలు చేపట్టారు. అనంతపురం జిల్లా వీఆర్ నుంచి బదిలీపై ఆయన ఇక్కడికి వచ్చారు. సోమవారం ఆయన సీఐగా బాధ్యతలు స్వీకరించిన తరువాత స్టేషన్ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ న్యాయం కోసం వచ్చే ప్రతి ఒక్కరి పట్ల మనం జవాబుదారీ తనంగా వ్యవహరించాలని సూచించారు.

ఆలయంలో పౌర్ణమి పూజలు

సంబేపల్లె : మండల పరిధిలోని నారాయణరెడ్డిపల్లె లోని తిరుమలరాయి గుట్టపై కొలువైన వేంకటేశ్వర స్వామికి సోమవారం భక్తులు పౌర్ణమి పూజలు నిర్వహించారు. ప్రతి పౌర్ణమికి ప్రత్యేక పూజలు జరుగుతాయని ఆలయ కమిటీ తెలియజేసింది. భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

క్లుప్తంగా

ఆధార్ క్యాంపులు వాయిదా

పుల్లంపేట : ఆధార్ క్యాంపులు వాయిదా వేసినట్లు ఎంపీడీఓ రఘురాం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 20వ తేదీ నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్న ఆధార్ క్యాంపులను జీఎస్‌డబ్ల్యూఎస్ డైరెక్టర్ ఆదేశాల మేరకు వాయిదా వేస్తున్నట్లు వారు తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని ఎంపీడీఓ తెలియజేశారు.

ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొట్టాలి

రాయచోటి (జగదాంబ సెంటర్) : సమాజంలో ఎయిడ్స్ మహమ్మారిని తరిమికొట్టాలని కమ్యూనిటీ ఆర్గనైజర్ ఎం.రమణమ్మ పిలుపునిచ్చారు. రాయచోటి పట్టణం 'పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా)'లో ఏపీ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ(పీసీఎస్) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన మీకు తెలుసా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రమణమ్మ హాజరై మాట్లాడారు. ఎయిడ్స్ వ్యాధి ఎలా వ్యాపిస్తుంది ఎలా వ్యాపించదు ఎయిడ్స్ వ్యాధి రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి తదితర అంశాలను ఆమె వివరించారు. కార్యక్రమంలో పీసీఎస్‌ఎస్ ఏఎస్‌ఎం నాగరాజు, సిబ్బంది కల్యాణ్‌బాబు, రామయ్య, ఇంద్ర, వింధ్య(రీసోర్స్ ఆర్గనైజర్స్) పాల్గొన్నారు.

రక్తదానం మరొకరికి ప్రాణదానం

లక్కిరెడ్డిపల్లి : రక్తదానం మరొకరికి ప్రాణదానం అని బ్లడ్ క్యాంప్ నిర్వాహకుడు సలీం పేర్కొన్నారు. మండలంలోని రామాపురం రోడ్డు మార్గంలో ఉన్న మసీదులో సలీమ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బ్లడ్ క్యాంప్ కార్యక్రమంలో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. శిబిరంలో 60 మంది రక్తదానం చేశారని ఆయన పేర్కొన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయడం వలన మనం ఆరోగ్యంగా ఉంటామన్నారు. ఆపదలో ఉన్నవారికి రక్తం ఇవ్వడం వలన వారి ప్రాణాలను నిలబెట్టవచ్చన్నారు. రక్తం దానం చేయడంలో యువత ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. రాబోయే రోజులలో మరెన్ని బ్లడ్ క్యాంపు కార్యక్రమాలను ఏర్పాటు చేసి రక్తదానం చేయడానికి యువతను ముందుకు తీసుకొస్తామన్నారు.

ఆలయాభివృద్ధికి విరాళం

రాజంపేట రూరల్ : ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ భువనగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అభివృద్ధికి భువనగిరిపల్లికి చెందిన ఆకుల సుబ్బనరసింహులు, శ్రీదేవి దంపతులు రూ.లక్ష రూపాయలు విరాళంగా అందజేశారు. ఆలయ ధర్మకర్తలు పూల హరిప్రసాద్, కంభయ్యగారి నరసింహులు, కావేరిగారి వెంకటరమణలకు సోమవారం దాతలు నగదును అందజేశారు.

వైభవంగా లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం


లక్ష్మీనరసింహస్వామి కల్యాణ దృశ్యం

పెనగలూరు : నారాయణ నెల్లూరు కొండపై లక్ష్మీ నరసింహస్వామి కల్యాణం సోమవారం వైభవంగా జరిగింది. గుట్టపై నూతనంగా నిర్మించిన ఆలయంలో మూడు రోజులపాటు విగ్రహ ప్రతిష్టా మహోత్సవ కార్యక్రమాలను నిర్వహించారు. సుమారు రూ. 40 లక్షలతో నూతన ఆలయాన్ని నిర్మించారు. కల్యాణం అనంతరం వందలాది మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ధ్వజస్తంభ ప్రతిష్టాపన నిర్వహించారు. కార్యక్రమానికి కళాచంద్ర సుమతీ దంపతులు సహకారం అందించారు.

ధ్యానంతో మానసిక ఒత్తిళ్లు దూరం

ఒంటిమిట్ట : ధ్యానం చేయడంతో మానసిక ఒత్తిళ్లను దూరం చేయవచ్చని బ్రహ్మకుమారీ శిరీషా తెలిపారు. సోమవారం ఆమె తహసీల్దార్ రమణమ్మ, ఎస్‌ఐ శివప్రసాద్, సీఐ కృష్ణంరాజు నాయక్‌లకు బ్రహ్మకుమారీ ధ్యాన మందిరానికి సంబంధించిన గోడపత్రాన్ని అందజేశారు. అనంతరం సీఐ కృష్ణంరాజు నాయక్, ఎస్‌ఐ శివప్రసాద్‌లకు రక్షాబంధన్ సందర్భంగా రాఖీని కట్టి ఆశీర్వాదం తీసుకున్నారు.

దివ్యాంగులలకు ఇళ్లపట్టాలివ్వండి


రాయచోటి అర్బన్: జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందచేస్తున్న ఏఐఎస్‌ఏ నేతలు

రాయచోటి అర్బన్ : జిల్లాలో అర్హులైన దివ్యాంగులందరికి ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని దివ్యాంగుల సంఘం జిల్లా అధ్యక్షుడు వంగిమళ్ల రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు విన్నవించారు. సోమవారం కలెక్టర్‌లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన కలెక్టర్‌ను కలుసుకుని మాట్లాడుతూ దివ్యాంగులుగా ప్రభుత్వం ద్వారా గుర్తించబడిన ప్రతి ఒక్కరికి అన్ని మండలాల్లో మూడు సెంట్ల ఇంటి స్థలం కేటాయించి ఇళ్లను నిర్మించి ఇవ్వాలంటూ కోరారు. గతంలో తెలుగుదేశం ప్రభుత్వం దివ్యాంగులకు రెండు సెంట్ల స్థలం పట్టాగా ఇచ్చినప్పటికీ స్థలం చూపించలేదన్నారు. ఆర్టీసీ బస్సులలో దివ్యాంగులకూ ఉచిత ప్రయాణ అవకాశం కల్పించాలన్నారు. అనంతరం ఈ మేరకు కలెక్టర్ ఛామకూరి శ్రీధర్‌కు వినతిపత్రం అందజేశారు.

బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారిపై ఫిర్యాదు

బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి సందప్పపై సోమవారం ఏఐఎస్‌ఏ జిల్లా అధ్యక్షుడు కిరణ్‌కుమార్ జిల్లా జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ఆయన మాట్లాడుతూ సందప్ప తప్పుడు డైట్ బిల్లులు సృష్టించి ప్రభుత్వ సొమ్మును కాజేశారని ఆరోపించారు. కమీషన్‌లకు కక్కుర్తిపడి తప్పుడు బిల్లులు చేశారన్నారు. తనకు కమీషన్ ఇవ్వలేదన్న కారణంతోనే గాలివీడు బీసీ వసతిగృహం అధికారిగా పనిచేస్తున్న అబ్దుల్ రహిమాన్‌ను సస్పెండ్ చేయించారంటూ చెప్పారు. జిల్లాలోని ప్రతి వసతిగృహ సంక్షేమాధికారి నెలనెలా ఆయనకు ముడుపులు చెల్లించాల్సిందే అన్నారు. కలెక్టర్ జోక్యం చేసుకుని సందప్ప అవినీతి, అక్రమాలపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలంటూ కోరారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ చేసిన జేసీ

పుల్లంపేట : పుల్లంపేట తహసీల్దార్ కార్యాలయాన్ని సోమవారం అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు పలు రికార్డులు పరిశీలించి 2003 సంవత్సరానికి ముందు ఇచ్చిన భూ పట్టాలు గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అరవింద కిషోర్, ఆర్‌ఐ నవీన్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవాణి హైస్కూల్ అనుమతులు రద్దుచేయాలి


రాయచోటి అర్బన్ : రైల్వేకోడూరు నియోజకవర్గంలోని ఓబులవారిపల్లెలో శ్రీవాణి హైస్కూల్ అనుమతులను రద్దుచేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం ఆయన డీఈఓ శివ ప్రకాష్‌రెడ్డిని కలుసుకుని మాట్లాడారు. వ్యాన్ బోల్తా పడి చిన్నారి భవిష్య మృతి చెందిన సంఘటనపై అధికారులు సరిగా స్పందించలేదన్నారు. పాఠశాల నిర్వహణకు ఎలాంటి వసతులు లేవన్నారు. పాఠశాలను రేకుల షెడ్డులోనే నడుపుతున్నట్లు తెలియజేశారు. పాఠశాలలో అగ్నిప్రమాదాల నివారణకు అవసరమైన పరికరాలు లేవన్నారు. అలాంటి పాఠశాల నిర్వహణకు అధికారులు ఎలా అనుమతులు మంజూరు చేశారో చెప్పాలంటూ కోరారు. వెంటనే పాఠశాల అనుమతులను రద్దుచేయాలంటూ డిమాండ్ చేశారు. అనంతరం ఈమేరకు డీఈఓ శివప్రకాష్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

ఉద్యాన వర్సిటీ వీసీకి సత్కారం


వీసీకి గోపాల్ దంపతులను సత్కారిస్తున్న అధ్యాపకులు, సిబ్బంది


రైల్వేకోడూరు అర్బన్ : డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ డాక్టర్ గోపాల్‌ను సోవవారం ఉద్యాన కళాశాల అధ్యాపకులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఇక్కడ కళాశాల డీన్‌గా విధులు నిర్వహిస్తూ వీసీగా పదోన్నతి పొందడం సంతోషంగా ఉందన్నారు. యూనివర్సిటీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. అలాగే పలువురు సిబ్బంది తమ సమస్యలు వీసీ దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ సయ్యద్ సదరన్సాషా, డాక్టర్ కేవీ వెంకటరమణ, రత్నం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవం


పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

రైల్వేకోడూరు అర్బన్ : పట్టణంలోని పగడాలపల్లిలో కోదండరామాలయ ప్రతిష్ట మహోత్సవం సోమవారం నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. రుత్విలకులు ఉదయం ఆలయ శుద్ధి చేసి యంత్రపూజ, అష్టదిగ్బంధనం, మూలమూర్తి హోమం చేసి పూర్ణాహుతి నిర్వహించారు. అనందరం మూలమూర్తికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ గావించారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశానికి ప్రజాప్రతినిధులు డుమ్మా


సర్వసభ్య సమావేశంలో ఖాళీగా ఉన్న కుర్చీలు


సుండుపల్లె : ప్రజా సమస్యల పరిష్కార వేదికగా జరగాల్సిన సర్వసభ్య సమావేశం వాయిదా పడడం పలు విమర్శలకు దారితీస్తుంది. వారంరోజుల క్రితం అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు సమావేశానికి హాజరుకావాలని సమాచారం ఇచ్చినా సమావేశానికి ప్రజాప్రతినిధులు ఎవరూ హాజరుకాకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శంగా నిలుస్తోంది. సోమవారం సర్వసభ్య సమావేశానికి అన్నిశాఖల అధికారులు హాజరయ్యారు. మండల వ్యాప్తంగా ప్రజలు, రైతులు సాగునీటి సమస్యలతో పాటు భూ సమస్యలతో సతమతమవుతున్నారు. ఈ సమస్యలపై ప్రస్తావించాల్సిన ప్రజా ప్రతినిధులు సమావేశానికి రాకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత మూడు నెలలుగా ఎంపీడీఓ కార్యాలయంలో మండల ఎంపీపీ సమావేశంలో తీర్మానించిన పనులు కాకుండా నిబంధనలకు విరుద్ధంగా మండల సమావేశంలో పనులు ఆమోదించకుండానే నిధులు చెల్లింపులు దారి మళ్లించినట్లు పలువురు ప్రజాప్రతినిధుల నుంచి విమర్శలు వస్తున్నాయి. సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీలు ప్రస్తావిస్తారనే నెపంతో ఎంపీపీ సమావేశానికి రాలేదని పలువురు ప్రజాప్రతినిధులు చర్చించుకుంటున్నారు.

నిరుద్యోగులకు ఆశాజనకం కోచింగ్ సెంటర్‌లు


ప్రారంభ వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే ఆకేపాటి

రాజంపేట రూరల్ : నిరుద్యోగులకు ఆశాజనకంగా అన్నమయ్య రైల్వే, ఏపీ పోలీస్ కానిస్టేబుల్ కోచింగ్ సెంటర్ మారుతుందని ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి అభిప్రాయపడ్డారు. మండల పరిధిలోని ఎస్.ఎర్రబల్లి వద్దనున్న ఎంపీఐ కార్యాలయం పక్కన పాలిటెక్నిక్ ఎదురుగా శ్రీరామ్ శ్రీనివాసులు లోకో పైలెట్ ఏర్పాటు చేసిన శ్రీ తాళ్లపాక అన్నమయ్య రైల్వే, ఏపీ పోలీస్ కానిస్టేబుల్ కోచింగ్ సెంటర్‌ను ఎమ్మెల్యే ఆకేపాటి ముఖ్య అతిథిగా సోమవారం పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగం చేయాలనే నిరుద్యోగులు ఇటువంటి కోచింగ్ సెంటర్‌లను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చొప్పా ఎల్లారెడ్డి, భూమా శివశంకరరెడ్డి, డి.భాస్కరరాజు, గడికోట సుబ్బారెడ్డి, అరిగెల సౌమిత్రి, దాసరి పెంచలయ్య, పోలీ వేణుగోపాల్‌రెడ్డి, గొబ్బిళ్ల త్రినాథ్, డీలర్ సుబ్బరామిరెడ్డి, జయచంద్ర, నరేష్, మధుయాదవ్, ఎం.శ్రీనివాసులగౌడ్, ఎంపీటీసీ ఎ.మధుబాబు, మాజీ ఎంపీటీసీలు రెడ్డెయ్య, చంద్రనాయక్ తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారులు హక్కులను కాపాడుకోవాలి



సబ్‌కలెక్టర్‌ను కలిసిన నియోజకవర్గ వినియోగదారులు ఫోరం కమిటీ ప్రతినిధులు

రాజంపేట : వినియోగదారుల హక్కులను కాపాడుకోవాలని రాయలసీమ జోన్ వినియోగదారులు ఫోరం అధ్యక్షుడు మేకల దర్బార్‌బాషా అన్నారు. సోమవారం సబ్ కలెక్టరేట్‌లో విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షుడు తిరుపాల్ ఆదేశాల మేరకు రాజంపేట, రాయచోటి, మదనపల్లెలో నియోజకవర్గ వినియోగదారుల ఫోరంలను ఏర్పాటు చేశామన్నారు. వినియోగదారులు హక్కుల చట్టం 1986లో వచ్చిందన్నారు. ఈ చట్టాన్ని 2019లో మార్పులు చేసి వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టంగా రూపొందించారన్నారు. వినియోగదారులు రాయితీలు, ఉచిత ప్రకటనలు, ఆన్‌లైన్‌లో చూసి మోసపోవద్దన్నారు. ఇలాంటి మోసాల ద్వారా హ్యాకర్లు మన సొమ్మును దోచేస్తారన్నారు. పాస్‌వర్డులు సులువుగా పెటుకొని, ఓటీపీలను ఇతరులతో పంచుకోవద్దన్నారు. కొనుగోలు చేసిన వస్తువు తయారీ, చిరునామా, గడువుతేదీ, కస్టమర్ కేర్ నంబరు సరిచూసుకోవాలన్నారు. డిజిటల్ పేమెంట్, క్యూఆర్ కోడ్, మొబైల్‌యాప్ ద్వారా చెల్లింపులు జరిపే ముందు వినియోగదారులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతులు విత్తనాలు, మందులు కొనేటప్పుడు బోగస్ కంపెనీల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. తప్పకుండా రసీదు పొందాలన్నారు. మోసానికి గురైతే కన్స్యూమర్ ఫోరంలో ఫిర్యాదు చేయాలని సూచించారు. రాజంపేటకు ఎన్నికైనా కార్యవర్గం తమ బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహిస్తామని వెల్లడించారు.

వినియోగదారుల ఫోరం కమిటీ నియామకం

రాజంపేట నియోజకవర్గ వినియోగదారులు ఫోరం అధ్యక్షుడిగా దార్ల శ్రీనివాసుల ఆచారి ఎంపికయ్యారు. సోమవారం సబ్‌కలెక్టరేట్‌లో నియోజకవర్గ వినియోగదారుల ఫోరం ఏర్పాటైంది. ఉపాధ్యక్షులుగా పెయ్యల శివ,అలీ అక్బర్ అలీషేర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా రాజంపేట సబ్‌కలెక్టర్ వైఖోమ్ నైదియాదేవిని మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు.

మానవత సేవలు అభినందనీయం


లక్కిరెడ్డిపల్లి: శాంతి ర్యాలీనుద్దేశించి మాట్లాడుతున్న మానవత సభ్యులు

లక్కిరెడ్డిపల్లి : మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యక్రమాలలో భాగస్వాములు కావాలని తహసీల్దార్ లక్ష్మీప్రసన్న, సబ్ ఇన్‌స్పెక్టర్ రవీంద్రబాబులు అన్నారు. మానవత సంస్థ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా సోమవారం లక్కిరెడ్డిపల్లి నలంద స్కూల్ దగ్గర ఎస్‌ఐ రవీంద్రబాబు శాంతి ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ నలందా పాఠశాల నుంచి ప్రారంభమై మిస్పా చర్చి మీదుగా వైఎస్సార్ సర్కిల్ వరకు సాగింది. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ లక్ష్మీ ప్రసన్న, ప్రిన్సిపల్ రామ్మోహన్ రెడ్డి, ఎంఈఓ చక్రేనాయక్, వెంకటసుబ్బయ్య, కో-చైర్మన్ శివశంకర్‌రెడ్డి, ఈవీ కృష్ణచైతన్య రెడ్డిలు సంస్థ సేవలను కొనియాడారు. ర్యాలీలో చైర్మన్ ఏఎస్ బాలసుబ్రమణ్యం, కేంద్ర కమిటీ సభ్యులు వై.ప్రసాద్ యాదవ్, ఎన్.సహదేవరెడ్డి, అధ్యక్షులు ఎస్ఎండీ షఫీ, నాయక్, జిల్లా సభ్యులు ఆరే శివయ్య, హెడ్ కానిస్టేబుల్ రాంప్రసాద్‌ల ఉపాధ్యాయులు, మానవత సభ్యులు, మనీషా స్కూల్, విశ్వభారతి స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

రాజంపేట రూరల్ : రాష్ట్ర వ్యాప్తంగా మానవత సేవా సంస్థ చేపడుతున్న సేవలు ప్రశంసనీయమని అర్బన్ ఎస్‌ఐ యు.లక్ష్మీప్రసాద్‌రెడ్డి కొనియాడారు. పట్టణంలో మానవత సేవా సంస్థ అధ్యక్షులు శ్రీనివాసులునాయుడు, కార్యదర్శి వై.నందకిషోర్‌గౌడ్, కోశాధికారి బి.రామచంద్రనాయుడుల ఆధ్వర్యంలో సోమవారం శాంతి ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎస్‌ఐ లక్ష్మీప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. ఈ ర్యాలీ స్థానిక ఆర్‌అండ్‌బీ నుంచి పాతబస్టాండ్‌లోని వైఎస్సార్‌సర్కిల్ వరకు సాగింది. ర్యాలీలో తుంగా రమణారెడ్డి, పీ వెంకటరమణ, శివరాజు, బి.సుబ్బరాయుడు, షేక్ అబ్దుల్లా, హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు పి.వెంకటరమణ, శ్రీనివాసులు, వై.కృష్ణమూర్తి, పి.ప్రభాకర్, రామానాజులు, ఖాలేషా తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

గాలివీడు : విద్యార్థుల అభ్యాసన ఫలితాలను మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల విద్యాధికారులు పిల్లి నాగరాజు, శ్రీనివాసులు సూచించారు. సోమవారం నెలవారీ సముదాయ సమావేశాల్లో భాగంగా జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్లకు, జిల్లాపరిషత్ బాలికోన్నత పాఠశాలలో ఎస్జీటీల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమగ్రశిక్షలో భాగంగా నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా ఉపాధ్యాయులు పని చేయాలని సూచించారు. పాఠశాలల్లో ప్రహరీ క్లబ్‌లను ఏర్పాటు చేసి విద్యార్థులు మత్తు పదార్థాలను వినియోగించకుండా, పాఠశాల పరిసరాల్లో విక్రయించకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే స్టూడెంట్ కిట్స్ విద్యార్థులందరికీ చేరేలా చూడాలన్నారు. ఉత్తమ అభ్యసనాల ద్వారా విద్యార్థి నైపుణ్యాలను వెలికితీసేలా దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మొహిద్దీన్, దుర్గేశ్వర్ రాజు, ఆర్పీలు ఉపేంద్ర, రామేశ్వర్, జి.నాగరాజు, సీవీ రమణ, యు.నాగరాజు పాల్గొన్నారు.

అనుబంధాల వేడుక.. రాఖీ పండుగ

విశిష్ట పండుగలకు నెలవు మన దేశం. సాంప్రదాయలు, జీవన విధానాల ఆధారంగా పండుగలు చేసుకునే సంస్కృతి మన సొంతం. అలాంటి దేశంలో అన్న–చెల్లెలు, అక్కా–తమ్ముళ్ల అనుబంధానికి పండుగ లేకుండా ఎలా ఉంటుంది. సోదర సోదరీమణులు అప్యాయత, అనుబంధాల గుర్తుగా చేసుకునేదే రాఖీ పండుగ. రాజంపేట, రైల్వేకోడూరు, రాయచోటి నియోజకవర్గాల పరిధిలో రక్షా బంధన్ పండుగను వేడుకగా జరుపుకున్నారు. తమ సోదరులకు రాఖీ కట్టి, మిఠాయిలు తినిపించి వారి ఆశీర్వాదాలు తీసుకున్నారు.

– సాక్షి, నెట్‌వర్క్


రాజంపేట రూరల్: ఎమ్మెల్యే ఆకేపాటికి రాఖీ కడుతున్న వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు


రాజంపేట రూరల్: ఓ ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థికి రాఖీ కడుతున్న దృశ్యం


ఓబులవారిపల్లె: మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఘనంగా రాఖీ పండుగ వేడుకలు


రాయచోటి టౌన్: ఓ ప్రైవేట్ కళాశాలలో రాఖీ పండుగ జరుపుకుంటున్న దృశ్యం


నందలూరు: రక్షాబంధన్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు